www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 4 ఫిబ్రవరి 2025

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు అర్బన్

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం మార్చి ఎనిమిదో తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో మార్చి ఎనిమిదో తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు, చిట్ ఫండ్స్ వివాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, టెలిఫోన్ బకాయిల కేసులు, మున్సిపల్ ఆస్తి, నీటి పన్నుల కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయనున్నట్లు తెలిపారు.

పంచాయతీల్లో 'లెక్క' లేదు..!

'ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలం వెలమిల్లి పంచాయతీలో రూ.కోటికిపైకి నిధులు దుర్వినియోగం. పెదవేగి మండలం నడిపల్లి పంచాయతీలో రూ.30 లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు అక్కడి ప్రజలు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకూ అవినీతి వ్యవహారం గుట్టు వీడలేదు. డివిజన్ పంచాయతీ అధికారి అవినీతి అధికారులకు కొమ్ము కాస్తున్నారంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది.'

'పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం చినఅమిరం గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదులు వెల్లువెత్తగా, విచారణ నిర్వహించిన అధికారులు రూ.2.73 కోట్లు నిధులు దుర్వినియోగం అయినట్లు తేల్చారు. దీంతో సదరు కార్యదర్శిపై క్రిమినల్ కేసులు పెట్టి ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్న పరిస్థితి ఉంది.'

నిధుల దుర్వినియోగంపై గ్రామాల్లో తీవ్ర చర్చ
హాట్ టాపిక్‌గా మారుతున్న కార్యదర్శుల వ్యవహార శైలి
అవినీతికి కొమ్ముకాస్తున్న ప్రజా ప్రతినిధులు
తప్పుడు ఆడిట్‌లతో కొనసాగుతున్న అవినీతి వ్యవహారం
ఇష్టానుసారంగా వెండర్ ఖాతాల్లోకి సొమ్ములు మళ్లింపు
అవినీతి అధికారులకు, మండల పంచాయతీ డివిజన్ అధికారుల అండ
పంచాయతీ నిధులు ప్రజలకు చేరేదెలా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై భయటపడుతున్న ఘటనలు ఒకటి, రెండు మాత్రమే. ఏలూరు జిల్లాలో 27 మండలాలు ఉండగా 547 పంచాయతీలు, పశ్చిమలో 20 మండలాల పరిధిలో 409 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రెండు జిల్లాల్లో చాలా పంచాయతీలకు సంబంధించి సగానికి సగం నిధులు పక్కదారి పడుతున్నట్లు గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు అవినీతి సామ్రాట్లుగా మారుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ప్రతినిధులతో చేతులు కలిపి ప్రజలకు చేరాల్సిన నిధులను ఇష్టానుసారంగా దారి మళ్లించి వాటాలు పంచుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తే తప్ప పట్టించుకోవడం లేదు. మండలాధికారులకు గానీ, పంచాయతీ డివిజన్ అధికారులకుగానీ ఫిర్యాదులు చేసినా ఎటువంటి ఫలితమూ ఉండడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా ఏలూరు జిల్లాకు సంబంధించి ఏదైనా పంచాయతీపై అవినీతి ఫిర్యాదు వస్తే పంచాయతీ డివిజన్ అధికారిని విచారణ అధికారిగా నియమిస్తున్నారు. అవినీతి అధికారులకు డివిజన్ అధికారి కొమ్ముకాస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెదవేగి మండలం నడిపల్లిలో విచారణకు వెళ్లిన డివిజన్ అధికారిని వెళ్లిపోవాలంటూ అక్కడ ప్రజలు నిరసనలు చేపట్టారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. పంచాయతీలకు సంబంధించి కింద నుంచి పైవరకూ పెద్దవ్యవస్థ ఉన్నప్పటికీ అవినీతి ఇష్టానుసారంగా సాగడానికి కారణాలపై ప్రభుత్వంగానీ, జిల్లా కలెక్టర్లుగానీ దృష్టిసారించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీల్లో సొమ్ము దారి మళ్లించడం సర్వసాధారణం అన్న రీతిగా మారిపోయింది. రూ.కోట్ల సొమ్ము దారి మళ్లించినా జనం ఫిర్యాదు చేసే వరకూ పైస్థాయి అధికారులు ఏంచేస్తున్నట్లు అన్న ప్రశ్నలకు సమాధానం లేకుండా పోయింది. పంచాయతీ అధికారి కార్యదర్శిపై మండలంలో ఇఒపిఆర్‌డి, ఎంపిడిఒ, డివిజనల్ పంచాయతీ అధికారి ఇలా మూడంచెల వ్యవస్థ ఉంది. అధికారులు పంచాయతీలకు పరిశీలనకు వెళ్లినప్పుడు రికార్డులు పరిశీలన చేస్తున్నారా.. అంటే లేదనే సమాధానం వస్తోంది. పరిశీలనకు వెళ్లిన అధికారులు మామూళ్లు తీసుకుని మౌనంగా వచ్చేస్తున్నారని, అందుకే పంచాయతీల్లో అవినీతి తారాస్థాయికి చేరిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీల సొమ్ము దుర్వినియోగంపై ఉన్నతాధికారులు సైతం సరిగ్గా దృష్టి సారించడం లేదన్న చర్చ సాగుతోంది.

తప్పు ఆడిట్ నివేదికలు..

పంచాయతీల నిధుల ఖర్చులకు సంబంధించి ఏటా ఆడిట్ అధికారులు ఆడిట్ చేస్తారు. ఎక్కడా నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఒక్క విషయం బయటకురాని పరిస్థితి. ప్రజల ఫిర్యాదులతో అవినీతి బయటపడిన పంచాయతీలు సైతం ఆడిట్ జరిగినవే. ఆడిట్ అధికారులను తమవైపునకు తిప్పుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. పంచాయతీల వెండర్ ఖాతాలకు సంబంధించి కార్యదర్శులు ఇష్టానుసారంగా ప్రారంభించి సొమ్ములు దుర్వినియోగం చేస్తున్నా ఆడిట్ అధికారులు ఎందుకు గుర్తించడం లేదో తెలియని పరిస్థితి నెలకొంది. పంచాయతీల్లో వెండర్ ఖాతాల ముసుగులో జరుగుతున్న అవినీతి అత్యధికంగా ఉంటుంది. బిల్లుల్లో సైతం తప్పుడు బిల్లులే అధికంగా ఉంటున్నాయని చెబుతున్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. పంచాయతీల్లో నిధులు సగానికి సగం దారి మళ్లిపోతుంటే గ్రామీణ ప్రజలకు ఏవిధంగా మేలు జరుగుతుందో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. పంచాయతీల్లో అవినీతి అడ్డుకట్టకు ప్రత్యేక చర్యలు తీసుకుంటే తప్ప ప్రజలకు న్యాయం జరిగే పరిస్థితి ఉండదు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

ముగిసిన సిపిఎం రాష్ట్ర మహాసభ

రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా బి.బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎ.రవి, ఎం.నాగమణి ఎన్నిక

నెల్లూరులో ఈనెల ఒకటో తేదీ నుంచి 3వ తేదీ వరకూ జరిగిన సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలో చివరి రోజు సోమవారం నూతన కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బి.బలరాం ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏలూరు జిల్లా నుంచి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం.నాగమణి ఎన్నికయ్యారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఆ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా మంతెన సీతారాం..

సిపిఎం రాష్ట్ర మహాసభలో కంట్రోల్ కమిషన్ ఐదుగురుతో ఎన్నికైంది. ఆ కమిషన్ సమావేశమై ఛైర్మన్‌గా మంతెన సీతారాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పూర్వ కార్యదర్శిగా, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా పనిచేశారు.

తొలిరోజు ఒక నామినేషన్

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్లు షురూ
10వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ

కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న అభ్యర్థి పి.రాజేంద్ర

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి తొలిరోజు సోమవారం ఒక్క నామినేషన్ దాఖలైంది. కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆయన అందించారు. ఈ నెల మూడో తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. ఈ నెల ఎనిమిది, తొమ్మిది తేదీలు సెలవు రోజులు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ ఏలూరు కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ జరగనుంది. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ ఉపసంహరణ గడువు ఉంది. ఫిబ్రవరి 27న ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్, మార్చి మూడో తేదీన ఏలూరులో ఓట్ల లెక్కింపు చేపడతారు. ఎన్నికలకు సంబంధించి 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ప్రశాంతంగా డిప్యూటీ మేయర్ల ఎన్నిక

డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఉమా మహేశ్వరరావుకు ధృవీకరణ పత్రం అందజేస్తున్న జెసి ధాత్రి రెడ్డి

50 మంది కార్పొరేటర్లకు 30 మంది మాత్రమే హాజరు
వైసిపికి చెందిన 20 మంది కార్పొరేటర్లు బాయ్‌కాట్
డిప్యూటీ మేయర్లుగా పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవానీ ఎన్నిక

డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దుర్గాభవానీకి ధృవీకరణ పత్రం అందజేస్తున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ల ఎన్నిక సోమవారం ప్రశాంతంగా ముగిసింది. టిడిపి నుంచి డిప్యూటీ మేయర్లుగా 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు, 47వ డివిజన్ కార్పొరేటర్ వందనాల దుర్గాభవానీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఏలూరు నగరపాలక సంస్థ సమావేశం హాల్లో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్, ప్రిసైడింగ్ అధికారి పి.ధాత్రిరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ల ఎన్నిక జరిగింది. ఏకగ్రీవంగా డిప్యూటీ మేయర్లుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు జెసి ధృవీకరణ పత్రాలు అందించడంతో ప్రక్రియ ముగిసింది. ఏలూరు నగరపాలక సంస్థకు వైసిపి ప్రభుత్వ హయాంలో 2021 మార్చిలో ఎన్నికలు జరిగాయి. 50 కార్పొరేట్ స్థానాలకుగాను ఆ ఎన్నికల్లో వైసిపి 47 స్థానాలను, టిడిపి మూడు స్థానాల్లోనూ గెలుపొందింది. దీంతో మేయర్, రెండు డిప్యూటీ మేయర్ పదవులు వైసిపి సొంతమయ్యాయి. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏలూరు ఎంఎల్ఎగా టిడిపి అభ్యర్థి బడేటి చంటి గెలుపొందారు. దీంతో ఒక్కసారిగా కార్పొరేషన్ రాజకీయం మారిపోయింది. మేయర్‌తో సహా 27 మంది కార్పొరేటర్లు టిడిపిలో చేరిపోయారు. దీంతో టిడిపి బలం 30 మంది కార్పొరేటర్లకు చేరింది. వైసిపిలో డిప్యూటీ మేయర్లుగా పనిచేసిన గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు అప్పట్లో తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో డిప్యూటీ మేయర్ల పదవులు ఖాళీ అయ్యాయి. ఖాళీగా ఉన్న రెండు డిప్యూటీ మేయర్ స్థానాలకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం ఎన్నిక ప్రక్రియ జరిగింది. ఈ కార్యక్రమానికి మొత్తం 50 మంది కార్పొరేటర్లకు గాను 30 మంది కార్పొరేటర్లు మాత్రమే హాజరయ్యారు. ఇంకా వైసిపిలోనే 20 మంది కార్పొరేటర్లు సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. కోరం ఉండడంతో ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగిపోయింది. రెండు డిప్యూటీ మేయర్ స్థానాలకు 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు, 47వ డివిజన్ కార్పొరేటర్ వందనాల దుర్గాభవాని నామినేషన్లు దాఖలు చేశారు. 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమా మహేశ్వరరావును డిప్యూటీ మేయర్ పదవికి 36వ డివిజన్ కార్పొరేటర్ భీమవరపు హేమసుందరి ప్రతిపాదించగా, 12వ డివిజన్ కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు బలపరిచారు. 47వ డివిజన్ కార్పొరేటర్ వందనాలు దుర్గాభవానీని డిప్యూటీ మేయర్‌గా 37 డివిజన్ కార్పొరేటర్ పృథ్వి శారద ప్రతిపాదించగా 28వ డివిజన్ కార్పొరేషన్ తంగిరాల అరుణ బలపరిచారు. ఇతర కార్పొరేటర్లు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయని కారణంగా డిప్యూటీ మేయర్లుగా ఎంపికైన పప్పు ఉమా మహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని డిప్యూటీ మేయర్లుగా ఎంపికైనట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ప్రకటించి వారికి ధ్రువపత్రాలను అందించారు. టిడిపి నుంచి గెలుపొందిన వందనాల దుర్గాభవాని వైసిపిలో గెలుపొంది టిడిపిలో చేరిన పప్పు ఉమామహేశ్వరరావుకు డిప్యూటీ మేయర్ పదవులను కట్టబెట్టిన పరిస్థితి నెలకొంది. ఎన్నికైన పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని లను ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగర మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎం ఆర్.పెదబాబు, సహచర కార్పొరేటర్లు అభినందించారు. అనంతరం డిప్యూటీ మేయర్లు దుర్గాభవాని, ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తమకు ఈ అవకాశం ఇచ్చిన ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణకు, మేయర్ నూర్జహాన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఏలూరు నగర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, అదనపు కమిషనర్లు, ఇతరులు పాల్గొన్నారు.

నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా సత్యనారాయణ

ధృవీకరణ పత్రం అందుకుంటున్న సత్యనారాయణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక ఆసక్తికర పరిణామాల మధ్య జరిగింది. నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా వైసిపి నుంచి రెండేళ్లు పనిచేసిన పగడాల సత్యనారాయణ టిడిపిలో చేరి మళ్లీ వైస్ ఛైర్మన్‌గా సోమవారం ఎన్నికయ్యారు. మొత్తం 32 కౌన్సిల్ సభ్యులు ఉన్న నూజివీడు మున్సిపాల్టీలో గత మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి 25, టిడిపి ఏడు స్థానాలు గెలుచుకుంది. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా రామిశెట్టి త్రివేణిదుర్గ, వైస్ ఛైర్మన్‌లుగా పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు ఉన్నారు. రెండు సంవత్సరాల వైస్ ఛైర్మన్ పదవి ముగియడంతో ఆ పదవికి సత్యనారాయణ రాజీనామా చేశారు. వైస్ ఛైర్మన్ పదవికి ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించడానికి సోమవారం ఏర్పాట్లు చేయగా 25 మంది కౌన్సిల్ సభ్యులుగా ఉన్న వైసిపి కౌన్సిలర్లలో వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణతో పాటు 9 మంది టిడిపిలో చేరారు. వైస్ ఛైర్మన్‌గా మరలా పగడాల సత్యనారాయణను నామినేట్ చేయగా టిడిపి సభ్యులతోపాటు వైసిపి నుండి టిడిపిలోకి వచ్చిన 10 మంది మొత్తం 17 మంది పగడాల సత్యనారాయణకు ఓటు వేశారు. మంత్రి కొలుసు పార్థసారథి ఓటుతో 18 ఓట్లు రాగా వైసిపి అభ్యర్థి నాగ మల్లేశ్వరరావుకు 14 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారి టిడిపి వైస్ ఛైర్మన్‌గా పగడాల సత్యనారాయణను ప్రకటించారు. ఈ నేపథ్యంలో నూజివీడు మున్సిపల్ కౌన్సిల్లో టిడిపి బలం 17 మందికి చేరగా వైసిపి బలం 14 మందికి చేరింది.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి

సిపిఎం ఆధ్వర్యాన బడ్జెట్ పత్రాలు దహనం

పత్రాలు దగ్ధం చేస్తున్న సిపిఎం నేతలు

నిడమర్రు :కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి మళ్లీ మొండి చేయి చూపించి తీరని అన్యాయం చేసిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పత్రాలను సిపిఎం మండలంలోని భువనపల్లిలో సోమవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నారపల్లి రమణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి మళ్లీ మొండి చేయి చూపించిందన్నారు. విభజన హామీలను పక్కన పెట్టిందన్నారు. రాజధాని నిర్మాణానికి నిధుల ఊసే లేదన్నారు. నిరుద్యోగ సమస్యను పట్టించుకోలేదని చెప్పారు. విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటి, ఐఐటి, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ గిరిజన యూనివర్సిటీ, దుగ్గరాజుపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, వెనుకబడిన జిల్లాలకు రాజధాని నిర్మాణానికి నిధుల ఊసే లేదన్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టం ఊసు కూడా లేదన్నారు. రాజధాని నిర్మాణానికి గతంలో ప్రకటించిన ప్రపంచ బ్యాంకు రుణాన్ని పదేపదే ప్రస్తావించడం మినహా చేసిందేమీ లేదన్నారు. ప్రయివేటీకరణకు అనుకూలంగా పేదలు, మధ్యతరగతి, కార్మిక వర్గాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు రూ.8,622 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో రూ.3,295 కోట్లు మాత్రమే కేటా యించిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, గవర సత్యనా రాయణ, లావేటి సోంబాబు,నాని, రాము, బొడ్డు శివ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు :ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వెట్రిసెల్వి కోరారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణ విషయమై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఎంఎల్‌సి ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 10 వరకు నామినేషన్లు స్వీకరణ, ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ పోలింగ్ ఉంటుందని, మార్చి మూడో తేదీన కౌంటింగ్ ఉంటుందన్నారు. మార్చి ఎనిమిదో తేదీ నాటికి పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని ఆమె వెల్లడించారు. ఈ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గంలో అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి 440 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిలో 3,15,261 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అదే విధంగా ఈ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందన్నారు. అదేవిధంగా ఇప్పటివరకు అందిన 8,501 క్లైయిమ్‌లు అన్నింటిని పరిశీలించి ఈ నెల ఐదో తేదీ లోపు ఇఆర్‌ఒ నెట్‌లో అప్ డేట్ చేయనున్నట్లు తెలిపారు. ఏలూరు డివిజన్‌లో ఎనిమిది మండలాల్లో 37 పోలింగ్ స్టేషన్లు, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో పది మండలాల్లో 23 పోలింగ్ స్టేషన్లు, నూజివీడు డివిజన్‌లో రెండు మండలాల్లో ఆరు పోలింగ్ స్టేషన్లు ఉంటాయన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా నాటికి 440 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటికి అనుబంధంగా 16 పోలింగ్ స్టేషన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంపై కూటమిలో కుమ్ములాట!

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్ల ఉద్యోగ నియామకాలు వివాదాస్పదంగా మారాయి. 15 గ్రామ పంచాయతీల్లో 18 ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలు కేటాయింపులో కూటమి నాయకులు అంతర్గతంగా కుమ్ములడుకునే పరిస్థితి నెలకొంది. ఉద్యోగాల కేటాయింపు విషయంలో కూటమి నేతలు తాము చెప్పిన వారినే నియమించాలని అధికారుల వద్ద పట్టుబట్టడంతో ఎవరికి కేటాయించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటివరకు అంతర్గతంగా జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో కూటమి నేతల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. ఇప్పటికే ఐదు పంచాయతీల్లో ఐదుగురిని నియమిస్తూ అధికారులు నియామక పత్రాలు జారీ చేయగా అందరి నియామకాలు నిలిపివేస్తున్నట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు చేసిన ప్రకటనతో ఈ అంశం మండలంలో చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే మండలంలో 15 పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది 18 మందిలో 15 మంది రిజైన్ చేశారని మిగిలిన ముగ్గురు పనిచేయడంలేదని, వారిని విధుల నుంచి తొలగించాలని ఉన్నతాధికారులకు పంపినట్లు అధికారులు తెలిపారు. అయితే ఆ స్థానాలను భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మండలంలోని కూటమి నేతలు పంచాయతీల్లో తాము చెప్పిన వారినే నియమించాలని ఒకే పంచాయితీలో తమ వాళ్లనే పెట్టాలంటూ టిడిపి నేతలు, మా వారినే పెట్టాలంటూ జనసేన, అంతేకాకుండా టిడిపిలోనే మరో గ్రూపు కూడా తమవారిని పెట్టాలంటూ ఎవరికి వారే పలు పేర్లు అధికారులకు అందించినట్లు తెలుస్తుంది. చివరకు మూడు పార్టీల వారు టిడిపికి పది, జనసేనకు ఆరు, బిజెపికి రెండు పంచుకునే విధంగా పలుమార్లు నేతల మధ్య పంచాయతీ జరిగినట్లు పలువురు చెబుతున్నారు. కాగా గత నెలలో అల్లంచర్ల, వెలగపాడు, రాజుపోతేపల్లి, బంధంచర్ల, తిరుమలదేవిపేట పంచాయతీలకు చెందిన ఐదుగురిని నియమిస్తూ ఎంపిడిఒ నియామక పత్రాలు జారీ చేశారు. అయితే ఈ నియమకాలపై మళ్లీ వివాదం మొదలైంది. ఈ విషయంపై పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు టి.నరసాపురం మండలంలో 18 ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకాలు అనివార్య కారణాల వల్ల నిలిపివేస్తున్నామని ఎంఎల్‌సి ఎన్నికలు కారణంగా వాయిదా వేస్తున్నామని, తరువాత పరిశీలించి నియామకాలు చేపడతామని స్వయంగా మీడియా ద్వారా ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. అయితే నియమించి ఉద్యోగాలు పొందిన ఐదుగురు వారి వారి పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించారు. వారి నియామకాలు కూడా నిలిపివేస్తున్నట్లు ఎంఎల్ఎ ప్రకటనతో వారు అయోమయంలో పడ్డారు. నియామక పత్రాలు అందించి ఉద్యోగంలో చేరిన తమను ఎలా తొలగిస్తారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే గత కొంత కాలంగా ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవవంతో కూలి పనులు లేకపోవడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి ఉపాధి పనులు కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియామకం చేస్తామని చెప్పారు.

రాష్ట్రస్థాయిలో హీల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్ పోటీల్లో హీల్ పాఠశాల అంధ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఆదివారం మంగళగిరిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఏడో పారా అథ్లెటిక్ పోటీల్లో మండల పరిధిలోని తోటపల్లి హీల్ పాఠశాలకు చెందిన అంధ విద్యార్థులు పరుగు పందెం, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, డిస్కస్ త్రోల్లో ప్రతిభను కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించడం పట్ల సోమవారం హీల్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్, అకాడమిక్ ఇన్‌ఛార్జి ఎం.హరిష్, ప్రిన్సిపల్ బి.సాయిబాబు, అంధ పాఠశాల చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్.రుష్మంత్, పిఇటి నాగరాజు, కోచ్ శ్రీనివాసరెడ్డి, కె.అబ్రహంలు విజేతలను అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కవచంగా క్లాత్ ఏర్పాటు

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు బస్టాండ్‌కు వెళ్లే దారిలో బాలికల హాస్టల్ పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ శాఖాధికారులు రక్షణ కవచంగా క్లాత్‌ను ఏర్పాటు చేశారు. ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖాధికారులు పాపారావు, సుబ్బారావు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ క్లాత్‌ను ఏర్పాటు చేశారు. అయితే కంచె ఏర్పాటు చేయకుండా క్లాత్‌ను ఏర్పాటు చేయడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి - పోలవరం

పంచాయతీ పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని పోలవరం పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు కోరారు. పోలవరం పంచాయతీలో ఈ మేరకు మైకు ద్వారా సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ ఇంటి పన్ను, కుళాయి పన్ను, షాపు లైసెన్సు ఫీజులు, పంచాయతీకి చెల్లించాల్సిన ఇతర బిల్లులు వెంటనే బిల్ కలెక్టర్‌కి చెల్లించి తగిన రశీదులు పొందాలని కోరారు. బిల్లులు సకాలంలో చెల్లించని వారికి ఆలస్య రుసుము విధించడంతో పాటు పంచాయతీ రాజ్ చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తంగెళ్లమూడి ప్రాంతంలోని పుష్పలీల నగర్ ప్రాంతానికి చెందిన బోను సాయిదుర్గాప్రసాద్ సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... పుష్పలీల నగర్ ప్రాంతానికి చెందిన బోను సాయి దుర్గాప్రసాద్ తాపీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఆరేళ్ల క్రితం దుర్గాప్రసాద్‌కు ఇంద్రాణికి వివాహమైంది. వీరికి ఐదేళ్ల వయసున్న ఒక కుమార్తె ఉంది. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ సోమవారం ఇంటి వద్దనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రెండో పట్టణ సిఐ రమణ, ఎస్ఐ నాగకళ్యాణ్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. దుర్గాప్రసాద్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన కుమారుడు మానసికంగా వేధింపులకు గురి కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తల్లి ఫిర్యాదులో పేర్కొంది. దుర్గాప్రసాద్ స్నేహితుడు శ్రీనివాస్‌తో ఇంద్రాణి కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని, అంతేకాకుండా తన కుమారుడు దుర్గాప్రసాద్‌ను మానసికంగా వేధిస్తుందని, దీంతో మనస్తాపానికి గురైన తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. మృతుడి భార్య ఇంద్రాణి, స్నేహితుడు శ్రీనివాస్‌లపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుర్గాప్రసాద్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - కుక్కునూరు

ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయాలపాలైన ఘటన మండల పరిధిలోని నెమలిపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వేలేరుపాడు వెళ్తుండగా నెమలిపేట వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ అనే వ్యక్తి మృతి చెందగా, దుర్గాప్రసాద్ గాయాలపాలయ్యాడు.

అన్నపై తమ్ముడి దాడి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సోదరుడే అన్నపై కత్తితో దాడి చేసిన ఘటన పెదవేగి మండల పినకడిమి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెదవేగి మండలం పినకడిమి గ్రామానికి చెందిన రెండు కుటుంబాలు పక్కపక్కనే నివాసం ఉంటున్నాయి. వీరు స్వయాన అన్నదమ్ములు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో పెదనాన్న కుమారుడు మరీదు మణికంఠ చిన్నాన్న కుమారుడు కూడా మరీదు మణికంఠగా పేర్లు వీరికి ఉన్నాయి. అయితే చిన్నవాడైన మణికంఠ తల్లిని పెద్దవాడైన మణికంఠ అసభ్య పద్యాలతో కొంత కాలం క్రితం దూషించాడు. దీంతో ఈ రెండు కుటుంబాల మధ్య వివాదం చిలికి చిలికి గాలి వానగా మారింది. కొంతకాలం క్రితం జరిగిన ఈ ఘటనపై అప్పట్లో పెద్దలు సంది కుదిర్చారు. అయినప్పటికీ చినమణికంఠ మాత్రం ఈ విషయాన్ని మనసులో ఉంచుకొని పెద్ద మణికంఠపై ఆదివారం తెల్లవారుజామున కత్తితో మెడపై దాడి చేశాడు. ఈ ఘటనలో పెద్ద మణికంఠకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న బంధువులు వెంటనే అతని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. దీనిపై మూడో పట్టణ పోలీసులకు పెద్ద మణికంఠ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుబ్బారావు తీవ్ర గాయాలపాలైన ఘటన ఏలూరు జాతీయ రహదారిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా అన్నవరం ప్రాంతానికి చెందిన కె.సుబ్బారావు మంగళగిరి హైకోర్టులో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఆయన ఆదివారం తెల్లవారుజామున అన్నవరం నుంచి ద్విచక్రవాహనంపై మంగళగిరికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఆయన వాహనం ఏలూరు జాతీయ రహదారిలోని చోదిమెళ్ల ప్రాంతానికి చేరుకునేసరికి ద్విచక్రవాహనం ఒకసారి అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఏరియా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. దీంతో ఆయన బంధువులు వెంటనే అతని ఏలూరు నగరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో మండలంలోని మిట్టగుడెంలో సోమవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో రెడ్డిగూడెం మండలంలోని అన్నేరావుపేటకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకోని 45 లీటర్ల నాటు సారాను, నాటు సారా రవాణాకు ఉపయోగించిన టివిఎస్ వాహనాన్ని, నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఆ వ్యక్తిని బెల్లాన్ని సరఫరా చేస్తున్న విస్సన్నపేటకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అజయ్ కుమార్‌సింగ్ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై నాటు సారా తయారుచేసి వారిపై, విక్రయించేవారిపై, నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం సరఫరా చేసే వ్యాపారులపై, బెల్లపు ఊట కలిగి ఉన్న భూ యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎక్సైజ్ సిఐ 9440902462 సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బడ్జెట్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికసిత్ భారత్ అంటూ ప్రచారాన్ని ఊదరగొట్టిన బిజెపి ప్రభుత్వం గిరిజనులను మరింత పేదరికంలో నెట్టే విధంగా బడ్జెట్ కేటాయింపులున్నాయని తెలిపారు. దేశ మొత్తం బడ్జెట్ కేటాయింపులు 50,65,345 కోట్లలో దేశ గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాంగబద్ధంగా కేటాయింపులు చేయాల్సిన 8.8 శాతం ప్రకారం గిరిజన సబ్‌ప్లాన్‌కు రూ.3,54,574 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.1,29,249 కోట్లు మాత్రమే కేటాయించి గిరిజనులకు తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. ఇందులోనే గిరిజన వ్యవహారాల శాఖకు గతేడాది రూ.13 వేలు కోట్లు కేటాయించగా ఈ ఏడాది బడ్జెట్‌లో అదనంగా కేవలం 1925 కలిపి రూ.14,925 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి నేరుగా ఉపయోగపడే రంగాల్లో కేటాయింపులు పూర్తిగా తగ్గించి కార్పొరేట్లు, బడా కాంట్రాక్టర్లు, ధనవంతుల ప్రయోజనాలకు లబ్ధి చేకూర్చే రంగాల్లో మాత్రం గణనీయమైన కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. ఉన్నత విద్యలో గిరిజన విద్యార్థులను మరింత ప్రోత్సహించాల్సిన కేంద్ర ప్రభుత్వం గతేడాది రూ.240 కోట్లు కేటాయించగా ఈ ఏడాది కేవలం రూ.రెండు కోట్లు మాత్రమే కేటాయించడం దేనికి సంకేతమో కేంద్రం ప్రభుత్వం సమాధానం చెప్పాలని తెలిపారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు గతేడాది రూ.440 కోట్లు కాగా ఈ ఏడాది రూ.313 కోట్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌లకు గతేడాది రూ.2,432 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.30 కోట్లు మాత్రమే అదనంగా పెంచి చూపించారని తెలిపారు. దేశంలో గణనీయంగా పెరుగుతున్న గిరిజన విద్యార్థుల సంఖ్యతో పోల్చుకుంటే ఇవి ఏమాత్రం సరిపోవని పేర్కొన్నారు. అర్థంపర్థం లేని పథకాల పేర్లు పెట్టి గిరిజనులను మాయ చేసే ప్రయత్నం చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా గిరిజన తెగల్లో పెరుగుతున్న నిరుద్యోగాన్ని రూపుమాపే విధంగా చిన్న పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి వంటి రంగాల్లో నిధులను అధికంగా కేటాయించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. గిరిజనుల్లో పేదరికం, అనారోగ్యం రోజురోజుకు పెరుగుతోందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసిన తరుణంలో కూడా ఉపాధి హామీ చట్టం, ఆరోగ్యం వంటి కీలక రంగాల నిధుల్లో కోత పెట్టడం బిజెపి ప్రభుత్వం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని తెలిపారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో రబీ పంట మొక్కజొన్న రైతులకు యాజమాన్య పద్ధతులు, విత్తనోత్పత్తి గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ లలిత సుధా మాట్లాడుతూ జాతీయ తెగులు పర్యవేక్షణ యాప్ ద్వారా రైతులు సలహాలు, సూచనలు క్షేత్రస్థాయిలో తెలుసుకోవచ్చన్నారు. ఆ యాప్‌ను రైతులు డౌన్‌లోడ్ చేసుకుని సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. డిఎటి కేంద్రం కోఆర్డినేటర్ ఏరువాక శాస్త్రవేత్త ఫణికుమార్ మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ, బ్యాక్టీరియా స్టాక్ రాట్, ఎండ తెగులు నివారణ సూచనలు తెలిపారు. బిఎస్ఆర్ నివారణకు బ్లీచింగ్ పౌడర్ నాలుగు కేజీలు ఎకరాకు వాడాలని తెలిపారు, ఎండ తెగులు నివారణకు ట్రైకోడర్మా విరిడి ఎకరాకు ఒక కేజీ చొప్పున పశు వుల ఎరువు వేప పిండితో కలిపి కల్చర్ తయారు చేసి పొలమంతా చల్లాలని తెలిపారు. తెల్ల దోమ నివారణకు వేప నూనె పది వేల పిపిఎం ఒక ఎంఎల్‌కి లీటర్ నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం విజయరాయి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రమణ మాట్లాడుతూ, మండల వ్యవసాయ అధికారిని ఎ.చాముండేశ్వరి మాట్లాడుతూ ప్రతి రైతు వారు వేసిన పైరు వివరాలను ఇ పంటలో నమోదు చేసుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్టర్ పోర్టల్ ద్వారా రైతు సేవా కేంద్ర సహాయకుల ద్వారా ప్రతి రైతు ఫార్మర్ ఐడి సంఖ్యను పొందాలని, వారి భూమి వివరాలు ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్ తీసుకొని రైతు సేవ కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు.

క్లాప్ ఆటోల డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరపాలక సంస్థలో అక్రమంగా తొలగించిన 60 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం ఏలూరు నగరపాలక సంస్థ క్లాప్ ఆటో డ్రైవర్ల సంఘం(సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక అశోక్ నగర్‌లోని డిప్యూటీ కమిషన్ ఆఫ్ లేబర్ (డిసిఎల్) కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిసిఎల్ పి.శ్రీనివాస్‌కు అందించారు. ఈ సందర్భంగా క్లాప్ ఆటోల డ్రైవర్లు క్లాప్ ఆటోలను కొనసాగించాలని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా క్లాప్ ఆటోల డ్రైవర్లను తొలగించడం అన్యాయమని, అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, సిఐటియు జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులు గత మూడున్నరేళ్లుగా ఏలూరు నగరపాలక సంస్థలో చెత్త సేకరణ విధులు నిర్వహిస్తున్న 60 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లను

ధర్నా చేస్తున్న సిఐటియు నేతలు

అక్రమంగా, అన్యాయంగా తొలగించారని, ఎలాంటి ముందస్తు నోటీసులు కూడా ఇవ్వలేదని, తక్షణమే వీరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తొలగించిన క్లాప్ ఆటోల డ్రైవర్లను విధుల్లోకి తీసుకోని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. చట్ట ప్రకారం కనీసం నెల రోజుల ముందస్తు నోటీసు ఇవ్వాలని, కాని ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వకుండా అధికారులు ఫిబ్రవరి ఒకటో తేదీన క్లాప్ ఆటోల డ్రైవర్లను 60 మందిని అక్రమంగా తొలగించారని ఆయన తెలిపారు. క్లాప్ ఆటోల డ్రైవర్ల ఉద్యమానికి కార్మిక, ప్రజాసంఘాలు మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు జి.రాజు, కార్యదర్శి బి.శ్రీను, గణేష్, హరీష్, సుగుణరావు, శ్రీను, ప్రేమ్, పుష్ప రాజు, లోకరాజు, జోషి తదితరులు నాయకత్వం వహించారు.

ఏలూరు అర్బన్ : ముందస్తు నోటీసులు ఇవ్వకుండా చట్ట వ్యతిరేకంగా నిలిపి వేసిన క్లాప్ ఆటోలను, డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కెవి.రమణ, బద్దా వెంకట్రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి నిలిపివేసిన క్లాప్ ఆటో డ్రైవర్లను, క్లాప్ ఆటోలను తిరిగి విధులకు తీసుకోవాలని తెలిపారు. కార్మికులకు ఉద్యోగం కల్పించిన తర్వాత ఆ ఉద్యోగాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందని, వారిని తొలగించడం అంటే చట్టరీత్యా నేరమని, వారికి ఉపాధి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని తెలిపారు. కార్మికుల ఉపాధి సమస్య పరిష్కరించే దిశగా ఏలూరు ఎంఎల్ఎ, కలెక్టర్ చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు.

బయోమెట్రిక్ విధానంలోనే ఎరువులను విక్రయించాలి

దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - ముసునూరు

రసాయనిక ఎరువుల దుకాణాల్లో కొనుగోలు, అమ్మకాలు రిజిస్టర్ ప్రతిరోజు మెయింటినెన్స్ చేయాలని జిల్లా వ్యవసాయ ఇంటర్నల్ ఇన్‌స్పెక్షన్ అధికారి పిజి.బుచ్చిబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రసాయనిక, క్రిమిసంహారిక మందులు రైతులకు అమ్మే షాపుల దుకాణాలను ముసునూరు మండల వ్యవసాయాధికారి కె.సూరిబాబు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. మండలంలోని ఎరువుల షాపుల డీలర్ల అందరితో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారితో మాట్లాడుతూ రైతులకు అమ్మే రసాయనిక, క్రిమిసంహారక ఎరువులను ఈ పాస్ ద్వారానే అమ్మాలని, షాపుల వద్ద ప్రతిరోజు రైతులకు కనపడే విధంగా బోర్డు ఏర్పాటు చేసి ఆయా దుకాణంలో ఉన్న ఎరువుల ధరలు రైతులకు కనపడే విధంగా బోర్డుపై ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతుకు అమ్మే ప్రతి వస్తువుపై తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, 1985 యాక్ట్ అమ్మకాలు, కొనుగోలు చట్టం ప్రకారంపై నిబంధనలను పాటించి, రైతులకు మేలు చేకూర్చే విధంగా ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఎరువుల డీలర్లందరూ ఈ పాస్ మిషన్ ద్వారా బయోమెట్రిక్ విధానంలోనే ఎరువులను విక్రయించాలని కెఆర్.పురం వ్యవసాయ సహాయ సంచాలకులు బుజ్జిబాబు అన్నారు. ఇంటర్నల్ స్క్వాడ్ తనిఖీలో భాగంగా సోమవారం ఆగిరిపల్లిలోని పలు ఎరువుల దుకాణాలను ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీలర్లందరూ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులందరూ తాము కొనుగోలు చేసిన ఎరువులకు తప్పనిసరిగా డీలర్ల వద్ద నుంచి బిల్లులు పొందాలని, డీలర్లు అధీకృత డిస్ట్రిబ్యూటర్ ద్వారానే స్టాక్‌ను పొందాలని, స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్‌ల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

న్యాయం చేయాలంటూ ఎస్‌పికి మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో తనకు న్యాయం చేయడం లేదని, తమకు న్యాయం చేయాలని ఓ మహిళ ఎస్‌పికి రిజిస్టర్ పోస్టు ద్వారా సోమవారం ఫిర్యాదు చేసింది. మండలంలోని పెయ్యేరుకు చెందిన అరుగుల రామలక్ష్మి (చిన్నమ్మ) అనే మహిళ స్థానిక గురజ సెంటర్ వద్ద కూరగాయల దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుంది. గత నెల 24వ తేదీ మండవల్లి మండలం లింగాలకు చెందిన ఆటో డ్రైవర్, మరి కొంతమంది వ్యక్తులు తన దుకాణం వద్ద ఆటో ఆపి తనను దుర్భాషలాడటమే కాకుండా అకారణంగా తనపై దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. జరిగిన విషయమై ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ తనకు న్యాయం చేయకపోగా తగు విచారణ చేయకుండా తనపై తప్పుడు కేసు పెడతానని ఎస్ఐ అనట్లు ఫిర్యాదులో పేర్కొంది. అదేంటాని తాను ఎస్ఐను ప్రశ్నిస్తే తన పట్ల దురుసుగా ప్రవర్తించారని, మళ్లీ స్టేషన్ మెట్లు ఎక్కితే మరో కేసు నీపై పెడతానంటూ ఎస్ఐ తనను బెదిరించి భయభ్రాంతులకు గురి చేసినట్లు రామలక్ష్మి ఎస్‌పికి పంపిన ఫిర్యాదులో పేర్కొంది. తనపై దాడి చేసిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదు చేసినట్లు రామలక్ష్మి తెలిపింది. ఈ విషయమై తనకు న్యాయం చేయాలంటూ రామలక్ష్మి ఎస్‌పిని కోరింది.

కౌన్సిలర్లకు మాజీ ఎంఎల్ఎ సత్కారం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వైసిపి వైస్ ఛైర్మన్ అభ్యర్థి నాడు నాగమల్లేశ్వరరావుకు మద్దతు పలికిన 14 మంది కౌన్సిలర్లను నూజివీడు మాజీ ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ వెళ్లిపోయిన కౌన్సిలర్ల వల్ల పార్టీకి ఎటువంటి నష్టం ఉండదని, నూజివీడు ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. ఒక సంవత్సరంలో మున్సిపల్ ఎన్నికలు ఉన్నాయని, మళ్లీ టిడిపికి ఏడు ఎనిమిది కౌన్సిలర్లకే పరిమిత అవుతారని అన్నారు. ఎవరూ ప్రలోభాలకు గురి కావొద్దని చెప్పారు.

ఆసుపత్రికి వీల్ చైర్స్ అందజేత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం సోమవారం ఒక అజ్ఞాత దాత ఆరు వీల్ చైర్స్‌ను అందించారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్.రాజు చెప్పారు. వీల్ చైర్స్‌ను అందించిన దాత తన వివరాలు తెలియజేయవద్దని కోరారన్నారు. సదరు వీల్ చైర్‌ను రోగులను వివిధ వార్డులకు తీసుకువెళ్లేందుకు వినియోగించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన సేవలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, నర్సింగ్ సిబ్బంది ఎస్తేర్ రాణి, అమ్మాజీ, భారతి పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్లకు సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరపాలక సంస్థను అభివృద్ధి చేసి రాష్ట్రంలోని మొదటి స్థానంలో నిలిచేలా పనిచేద్దామని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ అన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవానిలను పూలమాల, శాలువాలతో సత్కరించారు. డిప్యూటీ మేయర్లుగా ఎన్నికైన సందర్భంగా నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యురాలు జాలా సుమతి, జాలా బాలాజీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలాజీ మాట్లాడుతూ ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) నేతృత్వంలో నగర అభివృద్ధికి ఐక్యంగా కలిసి పనిచేద్దామని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేద్దామని కోరారు. రాష్ట్రంలోనే ఏలూరు నగర పాలక సంస్థను ఆదర్శంగా తీర్చి దిద్దటంలో అగ్రభాగాన ఉండాలని కోరారు.

పేదలకు మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని తిమ్మాపురం, కోడిగూడెం, రామసింగవరం గ్రామాల్లో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడానికి రూ.ఐదు లక్షలు తక్షణం మంజూరు చేయాలని సిపిఐ నేతలు కోరారు. ఈ మేరకు ద్వారకాతిరుమల తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేసి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ద్వారకాతిరుమల మండల కార్యదర్శి గోలిమే బాల యేసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు గ్రామాల్లో ఇంటి స్థలం లేని పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం, వికలాంగులకు పెన్షన్లు, డప్పు కళాకారులకు 50 ఏళ్లకే పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండల కార్యదర్శి గొలమే బాలయేసు, సిపిఐ గ్రామ కార్యదర్శి యడ్లపల్లి రమేష్, భూషణం, కొప్పుల రామకృష్ణ, పాకనాటి సుబ్బారావు, ఉండి మార్తమ్మ, పాకనాటి వెంకటేశ్వరరావు, నల్లటి దేవమాత, జాలాది సత్యవతి, యడ్లపల్లి లక్ష్మి, బయ్యారపు ఆనందరావు, నల్లటి పెద్దిరాజు, ఏపూరి పోతురాజు, జాలాది సుబ్బారావు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయం తథ్యం

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

దెందులూరు : ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయం తథ్యమని, దెందులూరు నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ అందించటమే లక్ష్యమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చెప్పారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల సన్నాహక నిమిత్తం నియోజకవర్గంలోని పార్టీ మండలాధ్యక్షులు, కూటమి నాయకులు, ఎంఎల్‌సి ఎన్నికల బూత్ కన్వీనర్ల సహ పలువురు నాయకులతో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దెందులూరు నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల పరిశీలకులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, ఎన్నికల కన్వీనర్లకు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఎన్నికల పర్యవేక్షకులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్‌లు ఎంఎల్‌సి ఎన్నికల నిమిత్తం దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నమోదైన దాదాపు ఎనిమిది వేల గ్రాడ్యుయేట్ల ఓట్లలో ఏడు వేల పైగా ఓట్లు పోలింగ్ జరిగేలాగా ఓటర్లకు అవగాహన కల్పించడంతోపాటు, కూటమి అభ్యర్థి అయిన పేరాబత్తుల రాజశేఖరానికి తొలి ప్రాధాన్యత ఓటు వేసే లాగా దెందులూరు నియోజకవర్గంలో బూత్ స్థాయి లెవెల్‌లో సైతం విస్తృత ప్రచారం చేపట్టనున్నామనాట్రు. నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల పర్యవేక్షకులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ అతి స్వల్ప కాలంలోనే సమిష్టిగా కృషి చేసి దాదాపు ఎనిమిది వేలకు పైగా పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించిన ఘనత దెందులూరు నియోజకవర్గంలోని కూటమి నాయకులకు, కార్యకర్తలకు దక్కుతుందన్నారు.

పంట కాలువల్లో పూడిక తీతలు

ముదినేపల్లి : మండలంలోని గురజ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పంటకాలువల్లోని పూడికతీత పనులను సోమవారం చేపట్టారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పంట కాలవల్లో పూడికలను పొక్లెయిన్లతో తీస్తున్నారు. పంట కాలువల్లో పేరుకుపోయిన పూడికల కారణంగా తాగు, సాగు నీరు శివారు ప్రాంతాలకు చేరడం లేదు. అలాగే కాలువల గట్లపై ముళ్ల చెట్లు దట్టంగా పెరిగాయి. దీంతో గ్రామ సర్పంచి మంచాల సరస్వతి ఆధ్వర్యంలో కాలువల్లో పేరుకు పోయిన మట్టిపూడిక తీతను, కాలువ గట్లపై దట్టంగా పెరిగిన ముళ్ల చెట్లను పొక్లెయిన్ సాయంతో తొలగింపు పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచి సరస్వతి, గ్రామ వైసిపి నాయకులు పర్యవేక్షించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

చింతలపూడి : గ్రామీణ మహిళలకు వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు క్యాన్సర్ వ్యాధి పట్ల పూర్తి అవగాహన కల్పించడమే లక్ష్యమని విశ్రాంత ఉపాధ్యాయురాలు థెరిసమ్మ తెలిపారు. మండలంలోని ఆశ్రమంలో 104 సిబ్బందితో కలిసి సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రాణం నిలవాలి ప్రతి ప్రాణం గెలవాలి అనే నినాదం అందరూ వద్దకు తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పి లావణ్య క్యాన్సర్ లక్షణాల గురించి వివరించారు.

పాస్‌పోర్టు పోయినది

ప॥గో॥జిల్లా, పెనుగొండ మండలం, వడాలి గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన బీల సూర్యకుమారి తండ్రి: రాంబాబు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఇంటి దగ్గర నుండి జిరాక్స్ సెంటరుకు వెళు తుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. పాస్‌పోర్ట్ నెం. R2787148 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

బీల సూర్యకుమారి
తండ్రి: రాంబాబు
డోర్ నెం. 5-8/1, రామాలయం వీధి,
జాంపేట, వడలి, పెనుగొండ మండలం,
ప॥గో॥ జిల్లా - 534325
సెల్: 99632 44221

వేలం ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు- నూజివీడు
ఇ.పి.నెం.91/2014 ఇన్ యల్.ఏ.ఓ.పి.నెం.22/2011

బిట్వీన్:
నామాల వెంకటరావు వగైరాలు ...డి.హెచ్.ఆర్/క్లెయింట్
మరియు
ది రెవిన్యూ డివిజినల్ ఆఫీసర్. నూజివీడు ...జే.డి.ఆర్

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి పై తెలిపిన జె.డి.ఆర్. యొక్క సంపూర్ణ సాధీన హక్కుభుక్తములలో వుండి పై తెలిపిన జె.డి.ఆర్. గారి కార్యాలయంలో ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు ఛార్జి కాబడి, వేలం కావలసియున్న చరాస్థి వివరం:

1) కంప్యూటర్స్	- 10	- రూ. 35,000/-
2) కుర్చీలు	- 20	- రూ. 15,000/-
3) టేబుల్స్	- 20	- రూ. 15,000/-
4) సీలింగ్ ఫ్యాన్లు	- 10	- రూ. 7,000/-
మొత్తం		రూ. 72,000/-

డి.హెచ్.ఆర్ విలువ రూ. 50,000/-
అమీనా విలువ Rs. 72,000/-

పైన తెలిపిన ఆస్థిని శ్రీ కోర్టు వారు ది. 13-02-2025వ తేదీన ఉ.గం. 10-30 ని.లకు బహిరంగ వేలం వేయుదురు. కావున కావల్సినవారు పాడుకొనవచ్చును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యమ్. రమేష్
నూజివీడు డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది
ది.01-02-2025 నూజివీడు
సెల్: 94402 57636

In The Court Of The First Addl. Civil Judge (Junior Division) Tanuku
I.A.No.539/2020 in O.S.No.640/2020 and O.S.No.640/2020

Between:
Padala Satyanarayana Reddy ... Petitioner & Plaintiff
and
Mudundi Subbalakshmi & Others ...Defendants & Respondents

D3: .Chiluvuri Manideepika,
W/o. Seeta Rama Raju,
R/o. Oduru (Penumantra Mandal)

వాది మరియు పిటీషనర్ తరుపున వేయించిన ప్రకటన

ఇందు మూలముగా 3వ ప్రతివాదికి పై నంబరు దావా O.S. No. 640/2020 లోనూ, I.A. No. 539/2020 పిటిషను లోను కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసియున్నారు. కావున ది. 24-02-2025వ తేదీన ఉదయం 10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరు అయి అభ్యంతరములు తెలుపు కొనవలెను. లేనియెడల మీ పరోక్షములో దావా మరియు పిటీషన్లు విచారణ చేసి తీర్మాణం చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గుడిమెట్ల వీర్రెడ్డి
తణుకు వాది తరుపు న్యాయవాది
తేది:03-02-2025 Cell: 94406 07793

మహారాజశ్రీ 1st ఎడిషినల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) Cum-1st ఎడిషినల్ మెజిస్ట్రేట్ ఆఫ్ 1st Class తాడేపల్లిగూడెం వారి కోర్టులో
O.S.No. 401/2022

Between:
నాయన లక్ష్మణరెడ్డి ... *Plaintiff*
And
కొప్పర్తి ఆదినారాయణ వగైరా ... *Defendants*

పై నెంబరు దావా గ్రంధములో 1st Defendant అయిన కొప్పర్తి ఆదినారాయణ S/o వెంకటరత్నం, Male, Age 45 Years, Business, Plot No.-503, శ్రీ సాయి సత్యం టవర్స్, 3టౌన్, opp: LIC Office, భీమవరం, W.G.Dt. అను మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు సమన్లు జారీ చేసిననూ, మీరు తీసుకొనక తప్పించుకుని తిరుగుతూ కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు Substitute of Service ద్వారా మీకు సమన్లు జారీ చేయవలసినదిగా ఆర్డరు యిచ్చియున్నారు. సదరు పై నెంబరు దావా ది.17-02-2025వ తేదీకి వాయిదా అయి ఉన్నది. కావున మీరు ది.17-02-2025వ తేదీ ఉదయం గం. 10-30 ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరయి మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున ఈ దావా తీర్మానము చేయబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తాడూరి లీలామాధవ్
సి.పి.ఆర్.రెడ్డి (రాజమండ్రి)
తాడేపల్లిగూడెం అడ్వకేట్స్
ది.02-2-2025 తాడేపల్లిగూడెం
సెల్: 94408 52182
93464 09563